ఏకాకి

శ్రీ శ్రీనివాస శిరోమణి [సాహితీసమితి]

౧

చీకటి పడబోతున్నది. పొలముపని మాసుకొని అప్పుడే నాగేశ్వరరావు ఇంటికివచ్చి వసారాలో కూర్చున్నాడు. తల్లి గౌరమ్మ దగ్గరకు వచ్చి కూర్చున్నది. ఆమెకు నలభై సంవత్సరముల వయస్సు ఉంటుంది. ముసలిదన్న మాటే. ఏమో చెప్పవలెనని ప్రయత్నము చేస్తుంది. కాని చెప్పలేకుండా ఉంది. చివరకు ఎట్లాగైతే నేమి గొంతుచేసుకొని "ఏమిరా నాయనా, ఎల్లుండి దశమి; మంచిరోజు; ప్రయాణానికి బాగా ఉందిట" అన్నది.

"అయితే ఏమంటావు?" అన్నాడు నాగేశ్వరరావు.

"ఏమీలేదు. మళ్లీ ఒకసారి పోన్నూరు వెళ్లి వస్తావేమో నని."

"ఎందుకమ్మా, లాభము లేదు. నాప్రాణము విసుగెత్తి పోయింది. ఆయనవచ్చి ఆ ఊళ్లో ఉండమంటాడు: ఎంత సేపు చెప్పినా. నీ పిచ్చి కాని ఆయన కూతురును ఎంతమాత్రమూ పంపించడు."

"ఏదో సలహా ఆయన ఇస్తాడు. కాని ఎందుకు పంపించడు కూతుర్ని ? ఎల్లకాలమూ ఆయన ఇంట్లో ఉంటుందా కూతురు ? ఆయనకు మటు కాసంగతి తెలియదు?"

"నీకు తెలియదులే. సంగతి చెప్పినా వినవు. ఏం చేసేది?"

"నీవు గట్టిగా పట్టుబడితే ఆయన పంపించక ఏంచేస్తాడు?"

"ఏంచేస్తా డేమిటమ్మా; ఏదో సాకు చెపుతాడు. పోనీ, దానితో రమ్మని చెపుదామా అంటే అసలు కంటికి కనబడితేగా! కనబడ్డా మాట్లాడదుగా! ఏది చెప్పినా తలకాయ వంచుకొని ఊరుకొంటుంది."

"పాపము దానికేమి తెలుస్తుందిరా; నీవు ఆయనతో మాట్లాడవలెను; కాని, దానితో చెపితే ఏం లాభము? అది అభము శుభము ఎరగనిది. సిగ్గో ఏమో! కాబట్టే నీతో మాట్లాడదు."

"అబ్బ, నాకు తెలియదు. పోనీ నీవుపోయి తీసుకొనిరా."

"బాగా ఉంది. నీభార్యను పంపించమంటూ మీమామగారి దగ్గిరకు పోవలసింది నేనా? నీవు వెళ్లి తీసుకొనిరారా నాయనా!"

"నన్ను చంపకు. నాకు తెలియదు."

"నీకు తెలిసింది ఏమిటిరా మరి ?"

"ఏమో నాకు అదంతా తెలియదు. నేను పోను."

" అయితే ఇట్లా ఒంటరిగానే ఉంటావా ఏమిటి?"

"ఆఁ."

"అయితే నేను జీవించిఉండగా నీకు సంసారము చేయడానికి ఇష్టము లేదన్నమాట. ఇది

నాకర్మము కామాల్సు. పోనీలేనాయనా నేను చచ్చిపోయినతర్వాతనే నీఇష్టము వచ్చినట్టు నీవ్వూ నీభార్యా ఊరేగండి." అని ఆమెకంట్ల నీళ్లు పెట్టుకోసాగింది.

"సరే. గోలగా ఉంది. మరి ఇప్పుడు నన్నేమి చేయమంటావో చెప్పు చూదాము."

"గోల ఏమిటిరా. నీవు ఈరాత్రికి బయలుదేరి పోన్నారువెళ్లి మీమామగారితో గట్టిగా చెప్పి నీభార్యను వెంటబెట్టుకొనిరా. ఆయన ఏవో సాకులుచెపితే నీవు ఏవో సాకులు చెప్పు. అంతగా అయితే నాకేదో పెద్దరోగము వచ్చిందనీ, అందుకోసరమయినా భార్యను పంపించమనీ గట్టిగా పట్టుబట్టు......... నీవు వెళ్ళకపోతే బాగుండదు. నిషేకము అయి రెండు సంవత్సరములు కావడమేమిటి: పట్టుమని పదిరోజులయినా అది మన ఇంట్లో ఉండకపోవడమేమిటి? విన్నవాళ్లూ చూసేవాళ్లూ ఏమనుకొంటారో తెలుసునా?"

"సరే. అయితే ఈరాత్రికే ఆఖరు పర్యాయము వాళ్లఇంటికి వెళ్లుతాను. ఆయనపంపిస్తానన్నా సరే; లేక అది వస్తానన్నాసరే. ఇట్లాజరగకపోయ్యేట్లయితే ఇక ఈజన్మకు ఈభార్యాప్రస్తావన నీవు తీసుకొనిరానని వాగ్దానము చేసేట్లయితే వెళుతాను. లేకపోతే లేదు."

"సరే. అట్లాగే. ఇక గాకపోదు, నీవు ఇంత గట్టిపట్టు పడితే."

"అది కాదు. నేను కోరినట్టు వాగ్దానము చేస్తేనే వెళ్లేది. లేకపోతే వెళ్లను."

"అట్లాగేరా నాయనా."

"సరే" నంటే "సరే" ననుకొన్నా రుభయులు. తెల్లవారుజామునే నాగేశ్వరరావు భార్యను తీసుకొని రావడము కోసరము అత్తవారి ఊరు బయలుదేరినాడు.

౨

వెంకయ్య సంపన్నగృహస్థు. స్వార్జితము అనేది ఆశేలేదు. ఆస్తిఅంతా పిత్రుపితామహార్జితమే. ఒక్కతే కూతురు. ఇంక పిల్లలు లేరు. కూతురు పుట్టిన నాల్గుసంవత్సరములకే తల్లి చనిపోయింది. అతనికి అప్పటిలో వయస్సు ముదరకపోయినప్పటికిన్నీ మనస్సు విరిగిపోయినందువల్ల తిరిగీ వివాహము చేసుకోలేదు. ఇక అతనికి జీవితములో ఆలంబనము కూతురే అయింది. ఇంత కాచిపోయడానికి ఇంట్లో ఒక ముసలమ్మ దూరపు బంధువు ఉంది.

లోకము ఏమంటుందో అనేభయమువల్ల పిల్లదానికి యుక్తవయస్సు రాగానే వెంకయ్య నాగేశ్వరరావు కిచ్చి వివాహము చేసినాడు. కాని కూతురు అల్లుడితో మరొకచోట ఒకప్పుడు ఉండవలసి వస్తుంది అనే సంగతి తోచేసరికి అతని గుండె నీరై పొయ్యేది; పట్టరాని ఆవేదన కలిగేది. ఈసంగతి గుర్తించే కాబోలు భాగ్యవంతులతో సంబంధము చేయక సామాన్యవసతిగల నాగేశ్వరరావుకు కుర్రదాన్ని ఇచ్చి వివాహము చేసినాడు.

నాగేశ్వరరావు తండ్రి బెజవాడ సమీపములోఉన్న రామవరప్పాడుగ్రామములో వ్యవ

సాయము చేసుకొని జీవనముచేసే సామాన్య గృహస్థు. విశేష భూవసతి లేకపోయినా భూగర్భముచీల్చి భూదేవిదాచిపెట్టుకొన్న అమృతాన్ని పైకిలేవనెత్తి సస్యములకా అమృతాన్ని పంచిపెట్టి జీవనముచేస్తూ ఉండేవాడు. నాగేశ్వరరావు ఆటే పెద్దతరగతులలోకి రాకపూర్వమే వివాహమూ అయినది; తండ్రిమరణించడమూ తటస్థించినది.

సాధారణముగా పెద్దలనూ, చిన్నలనూ, అందరినీ వ్యామోహపెడుతూ ఎందుకూ కొరమాలిన వాళ్లనుగా చేస్తున్న గుమాస్తా గిరివైపుకు అతనిమనస్సు పోలేదు. చేనికి కరగావేసి ఎప్పుడో వాటి చిన్నప్పుడు తనతండ్రి ఇన్ని నీళ్లుపోసిన విశ్వాసముచేత కల్పతరువులయిన కొబ్బరిచెట్లు యేటికి యేడాది ఎప్పుడు బడితే అప్పుడు అతను కావలెనను కొన్నప్పుడల్లా పదిరూపాయలు ఇస్తూ వచ్చినవి. ఇందువల్ల అతను వ్యవసాయమే వృత్తిగా పెట్టుకొన్నాడు.

అతనికి ఇరవై సంవత్సరములు వచ్చేసరికి సీతమ్మ రజస్వల అయినది. లోకాచారమునను సరించి కొంతకాలమయిన తరువాత వెంకయ్య కుర్రదానికి నిషేకముహూర్తము పెట్టించినాడు. నిషేకము జరిగింది. అయితే మొదటనుంచీ కూడా వెంకయ్యకు అల్లుడూ వియ్యపురాలూ వచ్చి తనఇంట్లో ఉండవలెనని సంకల్పము. నాగేశ్వరరావుకు ఇది ఎంతమాత్రమూ ఇష్టము లేదు. పోనీ వెంకయ్యే కూతురుతో సహా వెళ్లి అల్లుడిదగ్గిర ఉండకూడదా అంటే అతను ఇల్లూ వాకిలీ వదిలిపెట్టలేడు. పైగా ఆ ఊరికి అతను కరణము కూడాను. ఒకవేళ ఇల్లూ వాకిలీ భూమీ పుట్రా వదిలిపెట్టి వెళ్లి కూతురుదగ్గిర ఉంశవలెననుకొన్నా ఆకరిణీకము వదిలిపెట్టి వెళ్లవలెనంటే మాత్రము మనస్సు ఒప్పుకొనేది కాదు. అది కరిణీకములో ఉన్న మజా.

సీతమ్మకు నిషేకమయి రెండుసంవత్సరములు అయినప్పటికిన్ని కాముడు గుడ్డివాడు అయినందువల్లనో, మరికొంత ఔతసమువల్లనో ఆమె హృదయకవాటాన్ని తెరవలేదు; దగ్గరకు అయినా పోలేదు; దూరమునుంచి అయినా చూడలేదు. ఆమె ముగ్ధగా పెరిగిన ముగ్ధ. ముగ్ధ ఏమిటి? వయస్సువల్ల అవయవములలో మార్పు కలిగింది కాని హృదయములో మార్పు కలగలేదు.

నాగేశ్వరరావు హృదయకవాటాన్ని తెరవడమే కాకుండా మరఫిరంగులతో కాల్చివేయ సాగినాడు మదనుడు. పోనీ నాగేశ్వరరావు హృదయము అన్యథా పోయినా ఎట్లా ఉండేదో? అట్లా ఎందుకు జరుగుతుంది? అట్లా జరిగితే షోకు ఏముంటుంది? అతను కూర్చున్నా, నిలుచున్నా, పడుకొన్నా, ఏమి చేసినా సీతే ఆతని హృదయాన్ని ఆకర్షించేది. ఆరూపము, ఆమృదుమధుర కంఠస్వరము, ఆ అమాయికత్వము తప్ప మరొక రూపము, మరొక కంఠస్వరము అతని హృదయానికి ఉంఛలు పెట్టలేకపోయినవి. ఒకప్పుడు అత్తవారింటిలో ఉందామని నిశ్చయించినా క్షణ

ములో వైరిభావాత్రమువచ్చి ఊహాలను పాడు చేసేది. ఒకవేళ ఆ భావాత్రమును చంపుకొంటే అప్పటికి వ్యవసాయముచ్చి అడ్డుపడేది.

3

ఆ తెల్లవారుజామున బయలుదేరి ఉదయానికి నాగేశ్వరరావు అత్తవారిఇంటికి వెళ్ళినాడు. ఉచితరీతిని మామగారు అల్లుణ్ణి సత్కరించినాడు. మామగారి ఇంటివాకిలి సమీపించే వరకు ఉన్న పట్టుదల నాగేశ్వరరావుకు మామగారిని చూడగానే కొంచెము సన్నగిలింది. అందులో ఆయన సత్కారములను అందుకొన్న తరువాత సంగతిచెప్పవలసిన పనే లేదు. అయితే ఈదఫా మాత్రము అల్లుడిలాగా ప్రవర్తించడానికి కొంచెము ప్రయత్నము చేయసాగినాడు.

ఆపగలు భార్యతో ఏకాంతముగా మాట్లాడడానికి అవకాశము లేకపోయింది.

సాయంత్రము మప్పుడు మామగారితో వీలుచూసుకొని మెల్లిగా తనువచ్చిన పని చెప్పినాడు. ఆయన మామూలు పద్ధతిలో "సరే తప్పకుండా పంపిస్తాను. ఇకవస్తున్నది శ్రావణమాసము. అమ్మాయికి శ్రావణ మంగళవారముల నోము ఈ సంవత్సరముతో అయిపోతుంది. ఈమాసము వెళ్ళిపోయిన తరువాత నేనే స్వయముగా అమ్మాయిని వెంటబెట్టుకొనివచ్చి నీఇంట్లో దిగవిడుస్తాను. నాఇంట్లో ఎల్లకాలమూ ఉంచుకోవడానికి వీలవుతుందా నాయనా మరి? నేను మటుకు అంత అవ్యక్తుణ్ణా! ఇదివర కెప్పుడయినా పంపనన్నానా? ఏదో సందర్భపడలేదు కాని ......" అంటూ ఉండగానే "నాకదంతా తెలియదు. రేపు మీరు పంపిస్తేగాని వీలులేదు. నోములు అక్కడే నోచుకోవచ్చును" అన్నాడు నాగేశ్వరరావు.

"అట్లా కాదోయి, కోపపడకు. అక్కడ నోచుకోకూడదని అంటానా? ఏదో తల్లిలేనిపిల్ల కాబట్టి ఇక్కడే నోచుకొని వస్తుందని అంటున్నాను కాని; నేను పంపించనని ఎప్పుడన్నా అన్నానా? అట్లాంటి ఉద్దేశ్యమయినా లేదే! అట్లా అన్నా చెల్లుతుందా?"

"మీరు రేపుమధ్యాహ్నము రైలుకు మీఅమ్మాయిని ప్రయాణముచేసి పంపించితీరవలెను."

"సరే అట్లాగే. కాని నీవే సలహా ఇయ్యి. నాకు ఆడదిక్కు ఏమీ లేదన్న సంగతి నీకు తెలిసిందే కదా. ఇప్పుడు కుర్రదాని వెంట వచ్చేవారు ఎవరూ లేరు. ఒకనెల అయిన తరువాత నైతే దాని పినతల్లిని బ్రతిమాలి వెంట పంపిస్తే ఆమె ఒకవారము రోజులు ఉండి వస్తుంది. అప్పుడు బాగుంటుందని నా అభిప్రాయము."

"అయితే వెంట మరొకరు ఎందుకు?"

"కాదోయి. అది కొత్తగా నీ ఇంటికి వస్తూ ఉండె మరి. అంతా కొత్త. వెంట ఎవరయినా ఉండవద్దటోయి?"

"కొత్త ఏమిటి. ఇప్పటికి...... రెండు సంవత్సరములయితే?—మీరు రేపు పంపించి తీరవలెను."

"సరే నీ ఇష్టము; నీ భార్య ఇష్టము. నేను ఎంత చెప్పినా నీవు వినదలచుకోలేదు. సరే, దానితో చెప్పి అట్లాగే తీసుకొనిపో."

ఉభయులూ భీష్మీకరించుకొని ఊరుకొన్నారు. అతనికి వెంకయ్యమీద పట్టరాని కోపము వచ్చింది. ఇక భార్యకు నచ్చజెప్పి ఒప్పించి ఎట్లాగైనా తీసుకొనిపో నిశ్చయించినాడు.

ఒళ్లువంచి చక్కగా పనిపాటలు చేయడము తప్ప శృంగార ప్రబంధము లయినా చదివింది కాదు. సీత రుక్మిణీకల్యాణ మయినా చదువుకోలేదు. ఎప్పుడయినా చదువుకొంటే మొల్ల రామాయణము— అందులో హనుమంతుడి హడావిడి భాగములు చదువుకొనేది. అందువల్ల నాగేశ్వరరావు ప్రాణానికి ఆమె కేవలము పచ్చివెలగకాయలాగా మింగుడు పడకుండా అయిపోయింది.

త్రేతాయుగములో రామదూతగానూ, ద్వాపరయుగములో అర్జునుడి టెక్కెము మీదనూ, కలియుగములో ప్రపంచమంతటా ఇంటింటా కిరసనాయిల్ డబ్బామీదనూ, కుప్పిగంతులు వేస్తూఉన్న కోతిదేవుడు వారి ఇలువేల్పు.

బహుశః ఆహనుమంతుడే వాలము పెంచుకొని కూర్చుని మదనదేవుణ్ణి రానీయకుండా అదలిస్తూ ఉండవలెను. కాకపోతే వెంకయ్య తిరిగి వివాహము చేసుకోకుండానూ, సీత నాగేశ్వరరావుకు స్వయంగ్రాహ మివ్వకుండానూ ఉండడము ఎట్లా సంభవిస్తుంది.

సీతమ్మ మౌనముద్ర ధరించింది. అతను ఏమేమో చెప్పినాడు. బెదిరించినాడు, బెదరలేదు. ప్రగల్భాలు కొట్టడము మొదలుపెట్టినాడు. ఆమెను పూలలోపెట్టి పూజచేస్తానన్నాడు. తనపాలిటి దేవతగా తలచుకొంటానన్నాడు. తనగృహ మామెకు స్వర్గధామముగా ఉండేలాగు చేస్తానన్నాడు. ఏమేమో అన్నాడు. ఏమిచెప్పినా లాభము లేకపోయింది. ఆమె మౌనముద్రలోనే ఉంది.

ఆలోచించి ఆమెచేత ఒక్కనవ్వు నవ్వించవలెననుకొన్నాడు. ఎంతో ప్రయత్నము చేసినాడు. విఫలమనోరథుడయినాడు. తన అసమర్థతకు అట్టే పట్టరానిదుఃఖము వచ్చింది. ఇక యాచనకు తయారైనాడు. సీత చెయ్యిపట్టుకొని కౌగిటిలో చేర్చుకొని "నామీద దయలేదా? నామీద ఇంతకోప మెందుకు? నా ఇంటికి రావా? రావా?" అని ప్రశ్నించినాడు. ఆమె తలవంచుకొనే "వస్తాను" అన్నది. అతను పరవశమయిపోయినాడు. అదను కనిపెట్టి "కొద్దిరోజులయిన తరువాత వస్తాను," అన్నది సీత. అతను చిగునవ్వుతో "ఇప్పుడెందువల్ల రావు?" అన్నాడు.

"నేనువస్తే మానాన్న దిగులు పడతాడు." అన్నదామె.

"అయితే మీనాన్న పసిపిల్లవాడేం? పాపము పాలుతాగుతున్నాడు!" కోపముగా ఒక్కక్షణము ఊరుకొని "నీవు రేపు పదిగంటల రైలుకు రాక తప్పదు సుమా! పట్టికట్టి అయినా తీసుకొనిపోతాను తెలుసునా?" అన్నాడు.

* * *

తెల్లవారింది. వెంకయ్య ఉదయమే నాగేశ్వర రావు నిద్రలేవక పూర్వమే ఎక్కడికో వెళ్లి పోయినాడు. ఎనిమిదిగంట లయింది; తొమ్మిది గంట లయింది; తొమ్మిదిన్నర అయింది; పదిగంటలు కావస్తున్నది; ఆయన ఇంటికి వచ్చేజాడ కనిపించలేదు. పదింముప్పావుకు రైలు బయలుదేరుతుంది. క్షణక్షణముకు ఎండ ఎక్కువయినట్టుగానే నాగేశ్వరరావు కోపమూ ఎక్కువయి పోతున్నది. ఇంట్లో ముసలమ్మను వంటకానీయమని తొందర పెడు తున్నాడు. సీతను సామాను సర్దుకోమని తొందర పెడుతున్నాడు. మామగారిని వెతికి పిల్చుకొని రావడానికి ఇంట్లో ఉన్న జీతగాం డ్లను తోలినాడు.

పదిగంట లప్పుడు ఒకజీతగాడు తిరిగివచ్చి ఆయన ఒంటిగంటదాకా రావడానికి వీలులే నట్టున్నూ అల్లుణ్ణి భోజనము చేయమని చెప్పి నట్టున్నూ చెప్పినాడు.

అతనిఒళ్లు భగ్గున మండిపోయింది. ఒక చెంప ముసలమ్మ "నాయనా, అబ్బాయి వచ్చినతరు వాత పోదువుగానిలే నాయనా" అంటుంది. భార్య ఏమీ మాట్లాడదు. భోజనము చేసి నాడు. ఒకబండిని తీసుకొనివచ్చి ఇంటిఎదుట నిలుచోబెట్టినాడు. భార్యనురమ్మని ఆజ్ఞాపించి నాడు. ఆమె యథాప్రకారము మౌనముద్ర వహించింది. ఇటూఅటూ కదలనైనా లేదు, మెదలనైనా లేదు.

ముసలమ్మమాత్రము "నాయనా రాత్రిరైలు కు అబ్బాయితో చెప్పి సీతను పంపిస్తాను. ఉండునాయనా, తొందరపడకు" అంటూ బ్రతి మాలడము మొదలుపెట్టింది. అతనామాటలు వినిపించుకోలేదు. ఆఖరుపర్యాయము భార్యను సమీపించి అత్యంతాదరముతోనూ, కోపము తోనూ, "రావా, రావా," అన్నాడు. కొంచెము తంద్రతతో "నాన్న ఇంటికి రానీ యండి" అన్నదామె. "కాదు. ఇప్పుడే రావా లె. ఆమె ఊరుకొన్నది; జవాబు చెప్పలేదు. ఆమెను రూక్షముగా చూస్తూ "రావా?" అన్నాడు. జవాబు ఆమె నోటినుంచిరాలేదు. కాని ఆమెకండ్ల వెంట నీళ్లు కారసాగినవి.

నాగేశ్వరరావు బండి ఎక్కినాడు; స్టేషనుకు వచ్చినాడు; బెజవాడబండిలో కూర్చున్నాడు. అతనిమనస్సు డోలాయమానము అయిపో యింది. కోపమూ, తన అసమర్థతకు విచా రమూ ఎక్కువయిపోయింది. ఏదో ఒక విధ ముగా మనస్సు సరిపెట్టుకోవడానికి తగినంత మనోదార్ఢ్యము లేకపోయింది. ఇకస్నేహితుల నెవరినైనా సలహా అడగవలెననుకొన్నాడు. ఎందుకోసరము సలహా అడగవలెనో అతనికే తెలియదు. అతని మనస్సంతా అయోమయ మయిపోయింది.

బెజవాడలో రైలుదిగగానే తన చిన్ననాటి సహాధ్యాయిన్నీ మిత్రుడున్నూ అయిన ఒక లాయరువద్దకు వెళ్లినాడు. తనదురవస్థఅంతా చెప్పకొన్నాడు. ఇక నేమిచేయవలెనో చెప్ప మని అతన్ని సలహా అడిగినాడు. నాగేశ్వర రావుకు సలహా ఇవ్వడానికి తిరిగి ఒకసారి హిందూలాలో వివాహఘట్టమంతా చదివి—

అందుకు సంబంధించిన మరికొన్ని గ్రంథములు కూడాచూసి చివరకు Restitution of conj - gal rights కోసరము దావా తీసుకొని వస్తే భార్యను కోర్టువారు స్వాధీనము చేస్తారని చెప్పినాడు. తనభార్యను రచ్చకీడ్వడము అనే విషయం అతని హృదయాన్ని చాలా బాధించింది. ఇంకొక పద్ధతి లేదా అని ప్రశ్నించే సరికి ఆలాయరు ఆలోచించి తన మైనరు భార్యను Immoral and illegal purposesకోసరము ఇంట్లో అట్టి పెట్టుకొన్నట్టు మామగారి మీద దావా చేయవచ్చు నన్నాడు. అతనికి ఈ రెండు పద్ధతులూ నచ్చలేదు.

ళ

సాయంత్రముకు ఇంటికి చేరినాడు. ఇంటికి వెళ్ళగానే తల్లి "కూతుర్ని ఆయన పంపించ లేదుటరా" అని ప్రశ్నించింది. అతి కోపముతో "ఇకముందు ఆప్రస్తావన నాదగ్గర తేవద్దు పో" అన్నాడు. జరిగిన సంగతి ఏదో తరువాత నిదానముగా చెపుతాడని ఆమె ఊరుకొన్నది.

రాత్రి భోజనముచేసి పడుకొన్నాడు. నిద్ర పట్టలేదు. ఏమేమో యోచనలు చేయసాగినాడు. భార్యనుకానీ మామగారినికానీ రచ్చకీడ్వడము పెద్ద తప్పిద మనుకొన్నాడు. అట్లా చేయడానికి ఎంతమాత్రమూ ఇష్టము లేక పోయింది. ఇక మార్గ మేదో అతనికి గోచరించ లేదు. ఒక వేళ బలవంతముగా భార్యను తీసుకొనివచ్చినా అందువల్ల మరింత దుఃఖమే కాని సంతోషము ఆవగింజ అంత అయినా ఉండదని గుర్తించినాడు. ఆలోచించి ఆలోచించి హృదయము శూన్యమయిపోయింది. మృత్పిండముకు మల్లె అయిపోయినాడు. కొంత సేపు అయినతరువాత ఊపిరి తెచ్చుకొన్నాడు. నిద్రపోవలెనని ప్రయత్నముచేయ సాగినాడు. నిద్రరాదు. ఏదైనాపుస్తకము చదివితే నిద్రవస్తుందేమో ననుకొన్నాడు. పుస్తకము కోసరము అల్మారలో వెతకడము మొదలుపెట్టినాడు. 'భర్తృహరి' తీసినాడు. ఇక నేఘట్టము చదువుదామ నేది ప్రశ్న. పుటలుఊరక కొంత సేపు అటూఇటూతిరగవేసి చివరకు "పక్షద్వయ నిరూపణము" ఘట్టముతీసి పద్యము చదవడము మొదలుపెట్టినాడు.

"అఖిలపాతక భయహారియైన గాంగ
వారియందైన యువమనోహారి యగుచు
హారియగు కల్కి కుల్యామిటారి చన్ను
దోయియందైన వాసంబు సేయవలయు."

ఈపద్యము అతనికి బ్రహ్మానందము కలుగ జేసింది. ఆపద్యాన్నే తిరిగి తిరిగి చదివినాడు. ఎంత సేపు చదిపినా ఆపద్యమే. మరికొంత సేపటికి పైపద్యములు చదువవలె ననే సంకల్పము కలిగింది.

"కిమిహబహుభిరుక్తైర్యుక్తిశూన్యైః ప్రలాపైః
ద్వయమిహపురుషాణాం సర్వదాసేవనీయమ్;
అభినవమదలీలా లాలసం సున్దరీణాం
స్తనభరపరిఖిన్నం యౌవనంవా వనంవా."

ఈ పద్యముతో "భర్తృహరి"ని మూసి అవతల పెట్టినాడు. ఇక యోజన ప్రారంభించినాడు. "యౌవనంవా వనంవా" అనేది తప్ప మరొకటి తోచకపోయింది.

ఇదివరకంతా యౌవనాన్ని గురించి ఊహాగానము చేస్తూ ఎన్నెన్నో సౌధములను భావవీథిలో కడుతూ వచ్చినాడు. ఇప్పుడా సౌధములన్నీ విచ్ఛేద మయిపోయినవి. ఇక "వనం" విషయమయి ఊహాగానముచేయ మొదలుపెట్టినాడు. ఇక మరొక తలంపు అతని తలలో జొరబడకుండా వచ్చింది. చిత్తస్థైర్యము లేనివాడికి లోకములో గతి స్నేహితులూ పుస్తకాలు. ఈ రెండు వారివారి పరిస్థితులను గమనించకుండానే తల్లకిందులు చేస్తవి.

ఇక నాగేశ్వరరావుకు 'యౌవనంవా వనంవా' రామనామస్మరణ అయిపోయింది. యౌవనపు ఊహేలేదు. అది అలభ్యమయిపోయిం దని నిశ్చయించినాడు ఇక నెన్నడూ భార్య ప్రస్తావన ఎవరితోనూ చేయలేదు; అతనిలో అతనైనా చేయలేదు. ఎవరయినా ఆ ప్రస్తావన చేయవచ్చినాఅవకాశమిచ్చేవాడు కాడు. తల్లి అయినా తరువాత ఆవిషయము అడగలేకపోయింది. అడిగినా చిరునవ్వుతో ఊరుకొనేవాడు.

రోజురోజుకు వైరాగ్యము ముదర సాగింది. భర్తృహరి అతనికి సుందరకాండ- భగవద్గీత అయిపోయింది. కేవలము పారాయణే చేస్తూ ఉండేవాడు. మామగారి దగ్గిరనుంచి మూడు నాల్గుఉత్తరములు వచ్చినవి. పైన దస్తూరి చూసి ఫలానావారివని గ్రహించి విప్పిఅయినా చూడలేదు. అవి విప్పిచదివితే తనఊహ ఏవిధముగా మారిపోతుందోనని భయము. మూడు మాసము లయింది; నాల్గుమాసము లయింది. భార్య అతనిఇంటికి రానూలేదు; అతని కా గొడవ పట్టనూలేదు. వైరాగ్యములో మునిగి తేలుతున్నాడు. తల్లికీ అతనివిషయము కొంతగొడవగానే ఉండింది.

౬

అతనికి తీర్థయాత్రాభిలాష కలిగింది. అదివరకు వ్యవసాయము చాలామటుకు మత్తరఫుచేసినాడు. ఇప్పుడు భూములన్నీ మక్తాకు ఇచ్చివేసినాడు. కొంత ధనము అదనముగా పుచ్చుకొన్నాడు. ఇంకా మరికొంత ధనము తీసుకొని ఒక శుభముహూర్తములో తీర్థయాత్రకు తల్లితోసహా బయలుదేరినాడు.

దేశదేశములూ తల్లితో తిరిగినాడు. చిట్టచివరకు నీలాచలము చేరినాడు. అప్పటి కతని ప్రకృతిలో మరొకమార్పుకలిగింది. వైరాగ్యముకుతోడుగా భగవద్భక్తి ఎక్కు వయింది. అందులో ఉత్తర హిందూస్థానములో తిరుగుతున్నరోజులలో రాధాకృష్ణతత్త్వము కొంచెం కొంచెము తలకెక్కింది. జగన్నాథము వచ్చేసరికి ఒకవిధముగా ఉన్మత్తావస్థలో ఉన్నాడనే చెప్పవచ్చును. అస లతని తలంపు ఒక కొంతకాలము జగన్నాథములో ఉండిపోయి శ్రీ కృష్ణచైతన్యులవారు ప్రతిపాదించిన రాధాకృష్ణభావము నవగాహన చేసుకొనవలెననే.

ఈ మార్పు తల్లి కనిపెడుతూనే వచ్చింది. కాని ఆమె ఏమిచేయగలదు. తొందరగా ఇంటికి కుమారుణ్ణి చేర్చవలె ననుకొని ప్రయాణము తొందర చేయసాగింది. నీలాచలము వారు వచ్చేసరికి అక్కడ కలరా అతి తీవ్రముగా ఉంది. గ్రహచారవశమున తల్లికి కలరా తగిలింది. ఆమె జీవిస్తుందనే ఆశ పోయింది. తుద కామె మరణించింది. ఆమె కత నెంతో ఉపచారము చేసినాడు. కాని లాభము లేకపోయింది. యథావిధిగా ఆమె అపరకర్మలన్నీ నెరవేర్చినాడు. ఇక నింటికి వెళ్లవలెననే—అతని కొకచోట ఇల్లు ఉన్నదనే విషయమే జ్ఞాపకము రాలేదు. నీలాచలములోనే నిలచిపోయినాడు.

వంగవైష్ణవమఠములలో వైష్ణవసన్న్యాసుల వద్ద నిద్రాహారములు లేకుండా కాలక్షేపము చేయడము మొదలుపెట్టినాడు. భక్తిగ్రంథములు చదవడానికోసరము ఉరియా, బాంగ్లా భాషలు పఠించినాడు. అతనికి శ్రీ కృష్ణచైతన్యులవారు లక్ష్యమయిపోయినారు. ఆ మహామహుడికి మల్లెనే తానూ రాధాదేవి కృష్ణు కోసరము అనుభవించిన విరహబాధ అనుభవించసాగినాడు. అతనే రాధ అయిపోయినాడు. రాత్రింబవళ్లు అదే ధోరణి.

కృష్ణాష్టమినా డుదయము స్నానము చేసి ప్రాతఃసంధ్యావందనము ఆచరించి శ్రీ కృష్ణ ధ్యానము చేసుకొంటూ కూర్చున్నాడు. అతని కప్పుడు

"ఒంటెదిరుగుచు గోరిక లుజ్జగించి
శాంతిజేకొని పాణిభాజనుడనై ది
గంబరుడనై సమస్తకర్మంబు లెపుడు
మొదలు చెడద్రుంతు పరమేశ, సదయ
[హృదయ!"

అనే పద్యరాజము చెవుల్లో గింగురెత్తడము మొదలుపెట్టింది. లేచినిలుచున్నాడు. పద్యము మరల నొక్కపర్యాయము స్మరించి చూసినాడు. హుటాహుటి వైష్ణవస్వామి దగ్గరకు వెళ్లినాడు. ఆశ్రమము ఇవ్వమన్నాడు. అంత చిన్నవాడికి ఆశ్రమము ఇవ్వడాని కాయన శంకించి కొంతకాల మయినతరువాత ఇస్తానన్నాడు.

హృదయము ఆమాటకు వికలమయిపోయింది. భూమి పుట్రాఅంతా ఆనీలాచలములో ఉన్న శ్రీకృష్ణమఠముకు వ్రాసి రిజష్టరు చేయించినాడు. ఒక్కసారి నిశ్చలముగా యోజించినాడు. ఒకరు ఆశ్రమముఇచ్చేదేమి టన్నాడు. ముండనము చేయించుకొన్నాడు. వంగవైష్ణవ సాంప్రదాయము ప్రకారము ధౌత వస్త్రము ధరించినాడు. శ్రీ చైతన్యాలయముకు వెళ్లినాడు. సాష్టాంగ దండప్రణామము చేసినాడు. బయటకు వచ్చినాడు. "ఏడీ శ్రీకృష్ణు డేడి? ముద్దులకృష్ణు డేడి?" అన్నాడు. ఎక్కడికో బయలుదేరినాడు. ఎక్కడికి వెళ్లుతున్నాడో అతనికే తెలియదు. వెళ్లిపోయినాడు. ఏమయినాడో!

౭

అల్లుడు ఏమిహాడవిడి చేస్తున్నాడో ననుకొంటూ ఆరోజు మధ్యాహ్నము పన్నెండు గంటలప్పుడు వెంకయ్య ఇంటికి వచ్చినాడు. సంగతి సందర్భాలు తెలిసినవి.

రెండురోజు లయినతరువాత తన్ను క్షమించమంటూనూ, నెలరోజులలో తప్పకుండా కూతుర్ని తీసుకొని వెళ్లేటట్టున్నూ ఉత్తరము వ్రాసినాడు. ఉత్తరముకు జవాబు వచ్చి తీరుతుంది అనుకొన్నాడు. అయితే రాలేదు. కొంత ఆదుర్దా ప్రారంభమయింది. ఒక వారమురోజులు ఆదుర్దాపడి తిరిగి మరొకఉత్తరము వ్రాసినాడు. నాల్గుఉత్తరములు వ్రాసినాజవాబు లేకపోయింది. కారణము తెలుసుకోలేకపోయినాడు. పరిపూర్ణముగా కోపమువచ్చింది. తనూ క్షమించమంటూ అనేకసార్లు వ్రాయడము నుంచి అల్లుడికి పొగరెక్కువయిపోయిం దనుకొన్నాడు. తనంటే అలుసుఅయిపోయిం దనుకొన్నాడు. భీష్మీకరించుకొని ఊరుకొన్నాడు. వాడికవసరమువచ్చి వాడు దారికి వచ్చినప్పుడే ఆవిషయము ఆలోచించవచ్చునని మెదలకుండా ఊరుకొన్నాడు వెంకయ్య.

అయితే అతని స్నేహితులు మాత్రమూ ఊరుకోవడము మంచిది కాదని వెంటనే కూతుర్ని తీసుకొనివెళ్లి దిగబెట్టి రమ్మని సలహా చెపుతూ వచ్చినాడు. వెంకయ్యాశయము ఏమిటంటే తీరళ్లా కూతుకూ, తనూ వెళితే ఇంట్లోకి రానీయకుండా వెళ్లగొట్టి పరాభవము చేస్తాడేమోనని. తను అడిగినప్పుడు కొమార్తెను పంపకపోవడము అతనికి పరాభవము అనే సంగతిమటుకు జ్ఞాపకము లేకపోయింది. పోనీ ఏది ఎట్లా అయితే అట్లా అవుతుందని ఊరుకోనూ లేకపోయినాడు. ఏమీచేయనూ లేకపోయినాడు. ఆలోచించి ఆలోచించి అల్లుడి సంగతి సందర్భములు కనుక్కొనివస్తే కూతుర్ని తీసుకొని వెళ్లవచ్చు ననుకొని ఒకస్నేహితుణ్ణి ఆ ఊరు పంపించినాడు. ఆ స్నేహితుడు తిరిగివచ్చి అల్లుడూ, అతనితల్లీ తీర్థయాత్రలకు వెళ్లిపోయినట్టు చెప్పినాడు. ఇక చేసేది ఏముంది? అయితే ఊళ్లో వాళ్లమటుకు ఇది ఏదో కీడుకే వచ్చింది అన్నారు. కాని వెంకయ్యకు మాత్రము ధైర్యమే! వారు తీర్థయాత్రలనుంచి తిరిగిరాగానే కూతుర్ని తీసుకొనివెళ్లి దిగబెట్టవచ్చు ననుకొని నిశ్చింతగా ఊరుకొన్నాడు.

ఇంతకూ మన్మథుడు ఉత్తకొంటెవాడు. కాకపోతే ఇన్నాళ్లు ఊరుకొన్నవాడు ఈ సమయములో సీతమీద విసురుపుచ్చుకొని పూలు వేసినాడు. ఆమె కింక వెర్రెత్తిపోయింది. సీతకిప్పుడు అహోరాత్రములు పెనిమిటిని గురించిన చింత తప్ప మరొకచింత లేకపోయింది. పెనిమిటిదగ్గిరకు ఎప్పు డెప్పుడు వెళుదామా అని ఉవ్విళ్లూరడము మొదలుపెట్టింది. కొద్దిరోజు లయినతరువాత అసలు పట్టలేకపోయింది. తండ్రితో ప్రస్తావనచేయవలె ననుకొంటుంది: అయితే సిగ్గు. ఏమని మాట్లాడవలెనో తెలియక గిజాటుపడడము మొదలు

పెట్టింది. ఎవరినైనా సలహా అడగడానికైనా మిత్రులు లేరు. పోనీ పెనిమిటికి తన్ను తీసుకొని వెళ్లమంటూ ఉత్తరము వ్రాతామా అనుకొన్నది. ఈ ఊహ మరింత లజ్జావహమయింది ఆమెకు. చివరకు ఒకనాడు ఎట్లాగైతేనేమి తండ్రిదగ్గరకు చేరింది. ఏదో మాట్లాడవలెనని ప్రయత్నముఅయితే చేస్తుంది. కాని ఏమీ మాట్లాడలేకపోయింది. తండ్రి అది కనిపెట్టి "ఏమమ్మా, ఏమిటి" అన్నాడు.

"అయితే నాన్నా, రామవరప్పాడునుంచి ఉత్తరమేమీ రాలేదు కదూ."

"అవును. అయితేవాళ్లు-మీఅత్తగారూ మీ ఆయనా ఊళ్లో లేరుట. తీర్థయాత్రలకు వెళ్లిపోయినారుట."

"అట్లాగా; ఎన్నాళ్లయింది?"

"అదేమో తెలియదు. మొన్న మనశివయ్యను పంపిస్తే వాడు కనుక్కొనివచ్చి చెప్పినాడు."

"మరెప్పుడు వస్తారో?"

"మనకెట్లా తెలుస్తుంది."

"తెలియదూ?

"తెలిసేమార్గమేమి లేదు."

"ఎందుకువెళ్లారో తీర్థయాత్రలకు ?"

"అందరూ ఎందుకు వెళుతారో వాళ్లూ అందుకే వెళ్లిఉంటారు."

"కాదు నాన్నా, వారికి మనమీద విరక్తిపుట్టి వెళ్లిపోయినారేమో, ఇక రారేమో; ఎట్లాగా?"

"నీకేం వెర్రా? తీర్థయాత్రలకు వెళ్లినవాళ్లు మళ్లీ రాకుండా అక్కడే కూర్చుంటారా? ఏం మాటలు? వస్తారులే."

"అట్లాకాదు నాన్నా, వారికేదో చాలాకోపము వచ్చి వెళ్లిపోయి ఉంటారు. ఆవేళ వారికెంతో కోపమువచ్చింది. నీవు మూడునాళ్లు ఉత్తరములువ్రాసినా జవాబు వ్రాయలేదు కదూ."

"అయితే అది నాతప్పా. నీవు వెళ్లిపోకపోయినావు ఆరోజునే ఇప్పుడింత దిగులుపడేదానివి."

"నీవు ఆరోజున ఎందుకు మొఖము తప్పించావు?"

"నాకేదో పనిఉండిపోయినాను. నిన్ను నీపెనిమిటిదగ్గరకు వెళ్లవద్దని నేను చెప్పినానా?"

"అమ్మయ్యా, ఎంతవాడివినాన్నా! ఎంతమాట అంటున్నావు. నిజముచెప్పు, నేనువెళ్లడము నీకప్పుడు ఇష్టమేనా?"

"నాఇల్లు వదిలిపెట్టడము నా కిష్టములేకపోయినా నీవు నీపెనిమిటిదగ్గరకు వెళ్లవలెనాఅక్కర లేదా?"

"అప్పుడు మాట మాత్రము ఈ విషయము చెప్పావా నాన్నా? నన్ను అన్యాయం చేశావు. ఇప్పుడు వారికెంతో కోపమువచ్చి ఉంటుంది. నేనుపోతే ఇక నా మొఖము చూస్తారా? అయ్యో నాకొంపతీసినావు నాన్నా. ఇప్పుడు నేను వెళ్లిపోతాను. నీవు ఇంతమాట అన్న తరువాత నీఇంట్లో నేను ఉంటానా? నేను వెళ్లిపోతాను. సాయంత్రమునుంచి వెళ్లిపోతాను. నీజీతగాణ్ణి అయినా వెంట ఇస్తావా? పోనీ నీజీతగా డెందుకు? నాపెనిమిటిదగ్గరికి నేనే వెళుతాను.

సాష్టాంగపడతాను; క్షమించమంటాను; బుద్ధిగడ్డితిన్న దంటాను; ఇక ఉండను. వెళ్లిపోతాను.

"మా ఆయన ఇప్పుడు రామవరప్పాడులో లేడు తెలుసునా? ఎక్కడున్నాడో తెలియదు మరి. అంత తొందరపడకు."

"తొందరేమిటి ఎక్కడుంటే అక్కడికే వెళుతాను. ఏతీర్థములోనైనా కలుసుకోలేక పోతానా! చూస్తాను."

"అట్టే తొందరపడకు. కాస్త నిదానించు."

౮

తన్నూ పెనిమిటినీ త్వరగా కూర్చమని హనుమంతుణ్ణి ఇప్పుడు ప్రార్థించడము మొదలు పెట్టింది. పూర్వము అంటే ఎనిమిదిమాసముల కిందట పెనిమిటి తన్ను తీసుకొనిపోకుండా చేయమని హనుమంతుణ్ణి ప్రార్థించింది. ఇప్పుడేమో ఇట్లా ప్రార్థిస్తున్నది. హనుమంతుడేమి ఆమె బంట్రోతా?

ఇప్పుడామె తహతహ లాడడము మొదలు పెట్టింది. తండ్రిమీద ఉపద్రవమయిన కోపము వచ్చింది. తండ్రిని చూసినకొద్ది కోపము ఎక్కువ కావడము మొదలుపెట్టింది. తండ్రికి ఆప్తుడయిన శివయ్య అనే బ్రాహ్మణుడితో క్షోభపెట్ట సాగింది. పెనిమిటిజాడ కనుక్కొని రమ్మని ఆ బ్రాహ్మణుడిని ఎంతో తొందర చేయసాగింది. ఆబ్రాహ్మణుడు వెంకయ్యతో చెప్పి రామవరప్పాడు వెళ్లినాడు నాగేశ్వర రావుజాడ కనుక్కోవడానికి. ఆయన అతి ప్రయాసమీద సంగతి సందర్భములు విచారించి తిరిగివచ్చి, నాగేశ్వరరావు జగన్నాథ క్షేత్రము చేరినట్టున్నూ, అక్కడ తల్లి మరణించినట్టున్నూ, అతనుఆస్తినంతా ఏదో వైష్ణవమఠముకు రిజస్టరు చేయించి ఉంటాడనీ ఎందువల్లనంటే భూములపట్టా ట్రాన్సుఫరుకు ఆఊరికరణముగారి దగ్గరకు వచ్చినట్టున్నూ చెప్పినాడు.

ఈవిషయము వినేసరికి సీతకు మరింత పిచ్చి ఎత్తింది. తాను నీలాచలము వెళ్లి భర్తను చూడవలెనని పట్టుపట్టింది. ఆపూటభోజనము మానివేసింది. తండ్రిని తన యుక్తకాలములో బాధ్యతను బోధించలేదని తెగదూషించడము మొదలుపెట్టింది. ఆసాయంత్రము రైలుకే బయలుదేరింది. తండ్రికూడా ప్రయాణమయినాడు. తండ్రి తన వెంట రాకూడదని శాసించడం మొదలుపెట్టింది. తండ్రికి కూడా విసుగెత్తిపోయింది. చిట్టచివరకు ఆ శివయ్య అనే బ్రాహ్మణుడినే వెంటఇచ్చి కూతుర్ను జగన్నాథము పంపించినాడు.

* * *

వారమురోజులయింది.పదిరోజులయియింది.పదిహేనురోజులయింది. కూతురుక్షేమ సమాచారముఏమీలేదు. కూతురువెళ్లిన మూడో రోజునే వెంకయ్య మంచము పట్టినాడు. అయితే జబ్బేమీ లేదు. అయితే పదహారవనాడుమాత్రము హఠాత్తుగా మరణించినాడు.

* * *

నెలరోజులకు సీతమ్మ వచ్చింది. తమ ఇల్లూ, వాకిలీ, భూమీ, గీమీ అంతా ఔరసుల స్వాధీనమయి ఉన్నవి.